# మనసున్న మగువ

ఆ రోజు జానకిరామయ్యగారింట్లో చాలా హడావిడిగా వుంది. పెళ్ళికొడుకువాళ్ళు కళ్యాణి తమకు నచ్చిందని, తమ యింటి కోడలుగా చేసుకుంటామని మాటిచ్చి, నిశ్చయ తాంబూలాలు మార్చుకుని అప్పుడే వెళ్ళారు. తమ నిశ్చయానికి గుర్తుగా, కళ్యాణికి ఓ వుంగరం కూడా పెట్టి వెళ్ళారు.

జానకిరామయ్య మొహంలో తృప్తి వెల్లివిరిసింది. కళ్యాణికి వివాహం జరిగిపోతే, తనకింత బాధ్యత లేమీ వుండవన్న సంతోషం అతనిలో యిప్పట్నుంచే చోటు చేసుకుంది.

"ఈ రోజు నాకెంతో ఆనందంగా వుంది లక్ష్మీ! అమ్మాయికి మంచి సంబంధం కుదిరింది. అబ్బాయి అందంగా వున్నాడు. మంచి

వుద్యోగం ... మనసు మంచిదని అతడి మాటలే చెబుతున్నయ్.... కాస్తో కూస్తో వున్నవాళ్ళు. ఇంతకంటే మనం కోరుకునే దేవిఁటి చెప్పు?" అంటూ తన సంతోషాన్ని భార్య సమక్షంలో వ్యక్తం చేశాడు. "నిజవేఁనండీ! ఇంత మంచి సంబంధం దొరుకుతుందని, కలలో కూడా అనుకోలేదు. ఎటొచ్చీ వాళ్ళు వ్యవధి కోరడమే బాగుండలేదు," అంది లక్ష్మి తృప్తిగా.

"వాళ్ళు కోరారని అనుకోవడమే గాని, నిజానికి మనకీ వ్యవధి అవసరం కదా! అమ్మాయికి నగలు చేయించాలి. బట్టలు కొనాలి. దగ్గరి బంధువుల్ని పిలవడానికి స్వయంగా వెళ్లాలి. వ్యవధి మన మంచికే అనుకో!"

"అదీ నిజమే అనుకోండి! పెళ్ళికొడుకు అందరికీ నచ్చాడండీ! నిజంగా కళ్యాణి అదృష్టవంతురాలు."

"నేను మొదట్నుంచీ చెబుతూనే వున్నానుగా, అమ్మాయి అదృష్ట జాతకురాలని!"

లోపలి గదిలోంచి యెవరో లక్ష్మిని కేక వెయ్యగానే ఆమె అక్కణ్ణించి వెళ్ళిపోయింది. జానకిరామయ్య వీధిలోకి నిష్క్రమించాడు.

*　　　*　　　*

ఆనందరావు జూనియర్ ఇంజనీరుగా వుంటున్నాడు. స్ఫురద్రూపి ....సౌమ్యుడు సత్ప్రవర్తన గలవాడు. రెండు మూడు సంబంధాలు చూసి, అమ్మాయి నచ్చక, త్రోసిపుచ్చాడు. అయితే, కళ్యాణిని చూడగానే ఆనందరావు కళ్లు మెరిశాయి. ఆమె వర్చస్సు ఆ గుండ్రని మొహం, అధరాలపై సదా లాస్యం చేస్తుండే మందహాసం, వెడల్పాటి కళ్లు అతణ్ణి యిట్టే ఆకర్షించాయి. మరో ఆలోచన లేకుండా తన సమ్మతిని తెలియ జేశాడు.

కళ్యాణి కూడా యించుమించు ఆనందరావు లాగానే ఆకర్షింప బడింది. తల్లి ఆమె నిర్ణయాన్ని తెలుపమన్నపుడు, చిరునవ్వుతో అంగీకారాన్ని వ్యక్తీకరించింది. ఆనందరావు లాంటి భర్త తనకు లభించడం, పూర్వజన్మ సుకృతమే ననుకుంది.

ఆ ఇరువురి అంతరంగాల్లో, వాళ్ళకి తెలీకుండా పరస్పరం

అనురాగ లతలు పెనవేసుకున్నయ్. వ్యవధి దగ్గర పడుతున్నకొద్దీ, వారి లోని మమత పటిష్టమౌతోంది.

*     *     *

పెళ్ళిరోజు నిర్ణయింపబడింది. పెండ్లిపిలుపు పత్రికలు అచ్చ య్యాయి. హఠాత్తుగ 'విధి' చిన్నచూపు ఆనందరావుపై పడింది. మోటారు సైకిలు యాక్సిడెంటులో యిరుక్కున్న ఆనందరావు ఎడమచెయ్యి విరిగింది. ఆనందరావు ఆసుపత్రిలో చేర్చబడ్డాడు.

పెళ్ళి ఆగిపోయింది. కళ్యాణికి గుండె ఆగినంత పనయింది. విధి తనని యెందుకిలా వెక్కిరించింది?.... అన్న ప్రశ్న పదేపదే వేసుకుని, కుమిలి కుమిలి యేడ్చింది. నిశ్చయమైన తన వివాహం జరిగిపోతుందనీ, తనూ, భర్తా, అన్యోన్యంగా, హాయిగా, యెదుటి వారికి అసూయ కలిగిం చేలా సంసారం గడుపుతామని ఆమె కన్న కలలన్నీ గాలిలో కలిసిపోయి నందుకు, తన దురదృష్టానికి తిట్టుకుంది.

జానకిరామయ్య దంపతులు, మరింత బాధపడ్డారు. నిశ్చయమైన వివాహం, యిట్లాంటి పరిస్థితిలో తప్పిపోతుందని, వాళ్ళూ వూహించలేక పోయారు. అమ్మాయి, యెంతో అదృష్టవంతురాలని యిన్నాళ్ళు మురిసి పోయినవాళ్ళే, ఆమె దురదృష్టానికి కుమిలిపోతున్నారు, ఇప్పుడేం చెయ్యాలో వారికీ బోధపడ్డం లేదు.

"దేవుడికి మనమీద కరుణ లేదు లక్ష్మీ! లేకపోతే యిటువంటి విపత్తు తెచ్చిపెడతాడా?" జానకిరామయ్య స్వరం జీరపోయింది.

"ఏ పూర్వ జన్మలో యే పాపం చేసుకున్నామో, యిలా బాధ పడాల్సి వచ్చింది. అమ్మాయి మరీ కృంగిపోతోందండీ!" రుద్ధస్వరంతో అంది, లక్ష్మి.

"నిజమే లక్ష్మీ! కాని కృంగిపోయి నందువల్ల వచ్చిన ఫలితం యేమిటి చెప్పు? బాధ వుండదని చెప్పనుగాని, అనుబంధం యేర్పడలేదు గాబట్టి, మార్గాంతరం యేదో చూడాలి." సాలోచనగా అన్నాడు.

"అంటే....?"

"ఆనందరావుకి ఎడమచెయ్యి తీసేశారుగా! అంటే అవిటివా డైనట్టే! అటువంటి వాడికి, లక్షణంగా వున్న కళ్యాణిని కట్టబెడతామా?

ఎంత నిశ్చయమైన సంబంధం అయితే మాత్రం? లోకులు యేమంటారు?" భవిష్యత్తుని గురించిన ఆలోచనలు అతనిలో తలెత్తుతూ వుంటే, తన సందేహాన్ని బైటపెట్టాడు.

లక్ష్మి క్షణం మాట్లాడలేకపోయింది. నిజమే! ఈ సమస్య ఆలోచించాల్సిందే! నిశ్చయమైన సంబంధమని, ఆ అబ్బాయికే ముడిపెడితే, అమ్మాయి ఒప్పుకుంటుందా?

"మీరన్నది నిజమేనండీ! అబ్బాయి సలక్షణంగా వున్నపుడు నిశ్చయమైన సంబంధం యిది, అలాగని, అవిటివాడయ్యాడని తెలిసీ కూడా యెలా కట్టబెడతాం? అసలు అమ్మాయి ఒప్పుకోదు. చేతులారా దాని జీవితం కన్నీళ్ళమయం చెయ్యకూడదండీ!"

"అదే నేనూ ఆలోచిస్తున్నాను లక్ష్మీ! మరో సంబంధం చూద్దాం. అమ్మాయి కాస్తంత కోలుకోనీ....మాట్లాడుదాం...."

"ఇంక అమ్మాయితో మాట్లాడేదేమిటండీ! అడిగినా, మనసులో వున్న మాట చెప్పదు... ఆ విషయం నాకు వదిలేసి, మీరు వేరే సంబంధాలు చూడండి...."

"సరే...." అన్నాడు జానకిరామయ్య నిట్టూరుస్తూ.

*　　　*　　　*

ఆసుపత్రిలో కోలుకుంటోన్న ఆనందరావు, ముడుకువరకూ తీసేసి కట్లు కట్టిన తన మొండి చెయ్యిని చూసుకుని రోజూ కంటతడి పెట్టుకుంటున్నాడు. కృత్రిమ చేతిని తయారు చేయించవచ్చని, డాక్టరూ, స్నేహితులూ యెంత ధైర్యం చెప్పినా, అతనిలోని ఆవేదన సమసి పోవడంలేదు. అతని గుండెల్లో రగిలే మంటలు అతనికొక్కడికే తెలుసు. తన చేయి పోయిందనే బాధకంటే. కళ్యాణిని పోగొట్టుకున్నందుకే అమితంగా బాధపడుతున్నాడు. తన జీవనరాగంలో భగవంతుడు యెందుకీ అపశృతిని ఆలపించాడోనని కుమిలిపోతున్నాడు.

తలిదండ్రులు అతని మనోవేదనని సహించలేక పోతున్నారు. కాని, యేం చెయ్యగలరు? అబ్బాయిని అనునయపరుస్తూ, ధైర్యం చెప్పడం తప్పించి, యింకేం చెయ్యగలరు?

"అబ్బాయ్, నువ్వు మనసులో యేదో మధనపడుతూ, యెలా

కృశించి పోతున్నావో నీకు తెలీదు. ఓ సారి అద్దంలో నీ రూపం చూసుకుంటే తెలుస్తుంది. ధైర్యంగా వుండాలిరా!" అన్నాడోరోజు తండ్రి ముకుందం.

"ఔన్రా బాబూ! వూరికే బాధపడితే, పోయిన చెయ్యి వస్తుందా చెప్పు? ధైర్యం తెచ్చుకుని, మాలో ధైర్యం నింపాలిరా!" అంది తల్లి, తాయారు.

ఆనందరావు బరువుగా ఓ నిశ్వాసం విడిచాడు. తాను యెందుకు మథనపడుతున్నాడో, యెవరూ అర్థం చేసుకోవడం లేదనుకున్నాడు.

"నా చెయ్యి పోయినందుకు నేనాట్టే బాధపడలేదమ్మా! నొసటిరాత యెవ్వరూ తప్పించలేరు కదా! కాని, నాతో వివాహం నిశ్చయమైనందుకు, యెన్నో కలలు గంటూ, యెన్నో వూహల్ని పెంచుకుంటూన్న కళ్యాణి యెంత బాధపడుతుందోనని, నా ఆవేదనమ్మా! లేదా బాధపడ్డం మానేసి నాలాంటి అవిటివాణ్ని వివాహం చేసుకుందుకు నిరాకరించి, నాకు దూరమవ్వాలని నిర్ణయించుకుంటుందేమోనని నా బాధమ్మా! ఈ రెండు బాధల మధ్య నా హృదయం నలిగిపోతోంది...." అన్నాడు ఆవేదనతో.

ముకుందం బరువుగా నిశ్వసించాడు. అతని కళ్ళలో నీరు తిరిగింది. భార్యకేసి చూశాడు. ఆమె సుమారు యేడ్చినంత ఏడ్చేసి, చీర చెంగుతో కళ్ళొత్తుకుంది.

"ఇంక ఆ ఆలోచనల్నే నీ మనసులో పెట్టుకోవద్దురా అబ్బాయ్ ..." అన్నాడు కొడుకు మొహంలోకి చూడకుండా.

"ఏం నాన్నా?" ఆతృతగా అడిగాడు, ఆనందరావు.

"అదంతా యెందుకు లేరా! నువ్వు మరింత బాధపడతావు...."

"నిండా మునిగిన వాడికి చలేమిటి నాన్నా? చెప్పండి."

"కళ్యాణికి వేరే సంబంధాలు చూస్తున్నట్టు, అక్కణ్నించి వుత్తరాలొస్తున్నయ్...."

క్షణం మౌనం దాల్చాడు, ఆనందరావు. బావురుమని యేడ్వాలనిపించింది. కాని, యేడవలేకపోయాడు.

"పోనీలెండి నాన్నా! ఆమెను సుఖంగా వుండనివ్వండి. నా స్వార్థంతో నేనేమో వూహించుకుంటున్నానుగాని, ఆ స్వార్థం ఆమెకీ వుంటుంది

గదా!" అని చెబుతూ వుండే, అతని గొంతు పూడుకుపోయి, మరి చెప్ప లేక పోయాడు. అతని కళ్ళనించి అశ్రువులు చెక్కిళ్ళమీదికి జాలు వారినయ్.

తల్లి తాయారు, కొడుకు కన్నీరు చూడలేక, తనూ కంటతడి పెట్టుకుని, చీరచెంగుతో కొడుకు కళ్ళని ఒత్తింది.

"వూరుకోరా బాబూ! భగవంతుడు నీకు చాలా అన్యాయం చేశాడు....ఏం చేస్తాం?" అందామె.

ఆనందరావు తమాయించుకున్నాడు. తాను బాధపడ్డం, తలి దండ్రుల్ని తనతో పాటు బాధపెట్టడం; యేమిటోలా అనిపించింది.

ఎవరు యేం చెప్పినా, కళ్యాణి మనస్సుని తెలుసుకోవాలని పించింది.

"నాన్నా...."

"ఏమిటి బాబూ...."

"జానకిరామయ్యగారి అడ్రసు రేపొచ్చినపుడు తీసుకురండి.... కాదు....అడ్రసు రాసిన కవరు తెండి .. నా లెటర్‌పాడ్ తీసుకురండి...."

ముకుందంకి అవగాహన కాలేదు, కొడుకు అభిప్రాయ మేమిటో!

"ఎందుకురా?"

"కళ్యాణికి స్వయంగా వుత్తరం రాస్తాను నాన్నా!"

"జవాబిస్తుందంటావా?"

"ఆశిస్తున్నాను..."

"సరే మేం వస్తాం...." అంటూ ముకుందం లేచాడు. తాయారు భర్తతో పాటు వెళ్ళిపోయింది.

కళ్యాణికి యేం రాయాలో చాలా సేపు ఆలోచించుకున్నాడు, ఆనందరావు.

*　　*　　*

ఆ రోజు పోస్టుమాన్ అందించిన వుత్తరం మీద తన పేరు. నాన్న అడ్రసూ వుండటం చూసి క్షణంసేపు విస్తుపోయింది కళ్యాణి, ఎవరు రాశారా అని ఆలోచిస్తూ కవరు చించింది. వుత్తరం చివర

సంతకం చూసింది. 'ఆనందరావు' అని వుండటంతో ఆసక్తితో చదివింది
'కళ్యాణీ!

ఏమని సంబోధించాలో, ఎలా సంబోధించాలో అర్థంగాక, పైవిధంగా సంబోధించాను. మరోలా భావించవొద్దు. విధి వక్రదృష్టి నా మీద యెటువంటి ప్రభావం తీసుకువచ్చిందో వినే వుంటావు. నా ఎడమ చేయి మెుడుకు వరకూ తీసేశారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాను. ఎలా కోలుకున్నా, పూర్వపు మనిషిని కాలేను. మొండిచెయ్యి నా జీవితాంతమూ నన్ను వెక్కిరిస్తుంది. అందుకు నేను బాధపడలేదు. కాని, నా జీవితంలో అడుగు పెట్టబోతూ, హఠాత్తుగా యీ పరిణామాలకు గురయిన నీ గురించి ఆలోచిస్తున్నాను. ప్రతి క్షణమూ నువ్వే నా మనసులోను, నా కళ్ళల్లోనూ నిలిచి వుంటున్నావు. నిన్ను నా అర్ధాంగిగా పొందుతున్నందుకు మురిసిపోయే నన్ను, భగవంతుడు యీ విధంగా శిక్షిస్తాడనుకోలేదు. అయితే, నువ్వు నా సరసనుంటే, నాకు సంప్రాప్తమయిన యీ విపత్తును మర్చిపోగలను. ఈ అభ్యర్థనలో నా స్వార్థం వుంది. నేను కాదనను. నా స్వార్థంలో నా ఆనందముంది. మమత వుంది: అనురాగముంది. నా అనురాగాన్ని, మమతనీ పంచుకునే మనిషి అవసరం. ఒకప్పుడు నిశ్చయమైన విధంగానే మన వివాహం జరగడానికి నీకేమైనా అభ్యంతరమా? ఇందులో బలవంతమేమీ లేదు. మొహమాటం అంతకన్నా వొద్దు. నీ అభిప్రాయాల్ని నిర్భయంగా, నిశ్చింతగా చెప్పవచ్చు. వుంటామరి,

ఇట్లు
ఎప్పుడూ నిన్ను తల్చుకునే—
ఆనందరావు"

ఆ వుత్తరాన్ని రెండుసార్లు చదువుకుంది, కళ్యాణి. ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఆనందరావు ఆవేదనని సొంతం అర్థం చేసుకోగలిగింది. తనూ బాధపడుతున్నా, ఆయన బాధలో తన బాధ యెన్నోవంతు? అయనకు భవిష్యత్తంతా చీకటిమయంగా గోచరిస్తుందేమో! తన పట్ల ఆయనకి గల అనురాగాన్ని మర్చిపోలేక, తనని అభ్యర్థిస్తుండే అయన నవనీత హృదయాన్ని యిట్టే ఆకళింపు చేసుకుంది. ఆలోచనలో పడింది....వివాహం జరగలేదు గాబట్టి, యిన్ని ఆలోచనలకి అవకాశం

వచ్చింది. అదే వివాహం జరిగాక యీ ప్రమాదం తటస్థిస్తే, యీ ఆలోచనలకు తావుండేదా;.... ఆనందరావును తనూ మర్చిపోలేకపోతోంది. అంత మంచివాడి నీడను, అతను అవిటివాడన్న నెపంతో వదులుకుంటే, వేరొకరి నీడలో తను సుఖపడగలదన్న నిశ్చయం యేవిఁటి? వేరే సంబంధాల కోసం నాన్న వెదుకుతున్నా, నిశ్చయమైన సంబంధం తప్పి పోయిన తీరును ఆరాతీసి, తన జాతకాన్నే వాళ్ళు తృణీకరించవచ్చు. అప్పుడు తన భవిష్యత్తు యేమౌతుంది? రెంటికి చెడ్డ రేవడి కదా?.... యింక ఆలోచించలేక పోయింది. ఆమె ఒక నిర్ణయానికి వచ్చేసింది.

తండ్రికి ఆ వుత్తరాన్ని చూపించింది. ఆయన చదువుకుని నిట్టూర్చాడు.

"ఆ కుర్రవాడి బాధను తల్చుకుంటే జాలేస్తుందమ్మా! ఏంచేస్తాం? అతడి దురదృష్టం ...సానుభూతి చూపించడం మినహా మనమేం చెయ్యలేం...." అన్నాడు, జానకి రామయ్య.

"ఔనమ్మాయ్! అంతకంటే మనం యేం చెయ్యగలం?" అంది, లక్ష్మి?

"జవాబు యేం రాయమన్నారు?" అడిగింది, కళ్యాణి.

"ఏ జవాబూ రాయొద్దు. ఇంక వాళ్ళకీ మనకి సంబంధం యేవిఁటి? వూరుకో!" తన నిర్ణయాన్ని చెప్పాడు, జానకిరామయ్య.

కళ్యాణి, నిర్లిప్తగా ఓ నిట్టూర్పు విడిచింది.

"ఆయన యింత ఆవేదనతో యీ వుత్తరం రాస్తే, మనం యేమీ పట్టనట్టు వూరుకోవడం, చాలా అన్యాయం నాన్నా!" అంది ముక్తసరిగ.

"వూరుకోక యేం చెయ్యగలమమ్మా!"

"మనం ఆలోచించాల్సింది చాలా వుంది నాన్నా. ఆయనకి యీ ప్రమాదం మా పెళ్ళి జరిగాక జరిగి వుంటే, అప్పుడేంచేసేవాళ్ళం నాన్నా?"

జానకిరామయ్య, తెల్లమొహం వేశాడు. అతనికి ఆ ఆలోచన కళ్యాణికి రావడం మనస్కరించలేదు.

"అది వేరే విషయమమ్మా! అప్పుడు భరించలేక తప్పదు....ఇప్పటి పరిస్థితి అదికాదు. అవకాశం మనకుంది. అది నీ అదృష్టమే అనుకో!"

"ఏం అదృష్టమో, ఏవిఁటో నాన్నా! ఇక మీదట పెళ్ళి చూపులకు

యెవరొచ్చినా, యిప్పటి యీ సంఘటన తెలిస్తే, నా జాతకాన్ని నిందించ రని యెలా అనుకోవడం? అప్పుడు నేను మరింత కుమిలిపోవాల్సి వస్తుంది కదా! దూరం యోచించండి ..." నిరుత్సాహంగా చెప్పుకుపోయింది, కళ్యాణి.

చప్పున సమాధానం చెప్పలేకపోయాడు జానకిరామయ్య.

"అయితే, యిప్పుడు మనం ఏం చేద్దామంటావమ్మా?" నిస్సహా యంగా ప్రశ్నించాడు.

"నేనొక నిర్ణయానికొచ్చాను నాన్నా! ఆనందరావునే పెళ్ళి చేసు కుని భగవన్నిర్ణయాన్ని శిరసావహిస్తాను...." అంది దృఢ నిశ్చయంతో.

జానకిరామయ్య, భార్యవేపు చూశాడు. ఆమె కూడా ఏమీ అనలేక పోయింది.

"సరే! నీ యిష్టమమ్మా. మాకేం అభ్యంతరంలేదు" అనేశాడు జానకిరామయ్య.

"ఉత్తరం మరెందుకు రేపే మనిద్దరం బైలుదేరి ఆయన్ని చూడ్డానికి వెళ్దాం....స్వయంగా నా నిర్ణయాన్ని తెలియజేస్తే, ఆయన మరీ మురిసిపోతారు...."

"అలాగే నమ్మా!"

కళ్యాణి, తండ్రిదగ్గరున్న వుత్తరం తీసుకుని, తన గదిలోకి వెళ్ళి పోయింది. ఆమె మనస్సు వుత్సాహంతో వుయ్యాలలూగింది ఆమె హృదయం తేలికపడింది,

* * *

హాస్పటల్లో వున్న ఆనందరావు కళ్యాణిని, ఆమె తండ్రిని చూడ గానే వుప్పొంగిపోయాడు. ఆమె స్వయంగా వస్తుందని, అతను అనుకో లేదు. అతని మొహం, వికసిత పుష్పంలా వెల్లి విరిసింది.

"నా వుత్తరం అందిందా కళ్యాణీ?" అన్నాడు.

"అందిందండీ? మిమ్మల్ని చూడ్డానికే వచ్చాను...." అంది మొహం దించుకుని సిగ్గుతో.

"నా దురదృష్టం, నా ఆనందాన్ని కబళించివేసింది కళ్యాణీ!

ఈ పరిస్థితుల్లో నువ్వు నన్ను విస్మరిస్తావేమోనని భయపడ్డాను...." బాధగా అన్నాడు.

"అలా అనకండి.... మన వివాహ నిర్ణయం జరిగిననాడే, మనకో బంధం ఏర్పడింది ఆ బంధానికి ఎడబాటు వుండదు...."

"కళ్యాణీ, నిజంగా నువ్వు నాతో వివాహానికి అంగీకరిస్తున్నట్టేనా?" ఆనందంతో పరవశ్యం తొక్కిందతని మనస్సు.

"ముమ్మాటికీ అంగీకరిస్తున్నానండీ!"

ఆనందరావు, ఆమె చేతిని తీసుకుని, అనురాగంతో నొక్కి పట్టాడు.

"ఆ మాట చాలు కళ్యాణీ! నాకింక ఏ చింతా లేదు.... నా జీవితం మూడు పువ్వులూ, ఆరు కాయలుగా వుంటుందనడంలో సందేహంలేదు...." మురిసిపోయాడు.

అప్పుడే ముకుందం, తాయారు వచ్చారు.

"నాన్నా! అమ్మా! కళ్యాణి వచ్చింది. నన్ను వివాహం చేసుకుందుకు అంగీకరించింది...." ఆనందం పట్టలేక అన్నాడు.

"చాలా సంతోషం బాబూ!" అంటూ జానకిరామయ్య వేపు తిరిగాడు, ముకుందం. జానకిరామయ్యగారూ మీ అందరి మంచితనాన్ని మేం మర్చిపోలేం...." అన్నాడు.

"దానికేముంది లెండి...."

తాయారు, కళ్యాణికి ప్రక్కనే కూచుని, ఆప్యాయంగా ఆమె తల నిమిరింది. ఆమె కళ్ళల్లో ఆనంద భాష్పాలు మెరిశాయి.

"ఇంటికి పదండి ..." అంటూ వాళ్ళిద్దర్నీ తమతోపాటు యింటికి తీసుకెళ్లారు ముకుందం దంపతులు.

* యువ, దీపావళి సంచిక, 1975 *